

# కవిత్వం

నాయని శేషాచలరావు, బి.ఏ.

"అయ్యా! నమస్కారములండి శ్రీనాథుడు గారు! ఇలాగు వచ్చారేమి దివ్యలోకమునుండి" అని మోహనుడన్నాడు, మా ప్రక్క కుర్చీలో (సినిమా హాలులోని సంగతి లెండి) పచ్చ శాలువ కప్పుకుని కుండలములతో ప్రకాశిస్తూ వున్న వొక నడిమివయస్సు బ్రాహ్మణుని చూచి. "వచ్చితినోయి మీ లోకము చూచి పోదామని ఒక గంట సెలవు పుచ్చుకుని" అని అతడన్నాడు. "ఎవరురా? మోహను!" అని మా వాడ్ని గోకి సౌంజ్ఞగా అడిగాను "అతనా" అని మా వాడు గట్టిగా జెప్ప నారంభించాడు, "పూజారి వారి కోడలు తాజారగ బిందె జారి దబ్బున పడియెన్, మేజారు ఎల్ల తడిసెను, బాజారే—" అని పద్యములు వ్రాయలేదు శ్రీనాధ మహాకవి. అతనే యితను శ్రీనాధ మహాకవిగారు!" అని చెప్పాడు. నేనా మహా కవిని తేరపార జూచాను. నన్నాతడు తేరిపార జూచుచున్నాడు. మోహనుడు నన్నాతనికి జూపి, "చూచారా! శ్రీనాథుడుగారు! ఇత నొక కవి. బొద్దు క్రాపింగు పొడుగుపాటి లాల్చి, వల్లెవాటు కండువా. ఇవన్నీ బట్టి ఇత నొక భావకవి అని మీరు అనుకోవలెను" అని చెప్పాడు. "అయితే మీవాడు భావకవి అయితే మేము ముభావ కవులమా!" అని శ్రీనాథుడు పరిహాసాస్పదముగా నడిగాడు. "కాదండి. మీరు స్వభావ కవులండి" అని మోహనుడు వెంటనే జవాబిచ్చాడు. "భావములేని కవిత్వ మొకటుందా?" అని నేను ప్రశ్నించాను. "రసములేని పండుండదు. తొడిమలేని మొగ్గ వుండదు. భావములేని కవిత్వముండదు. కాదు గానీ శ్రీనాథుడుగారు! మావాడు తలుపు చెక్కనుజూచి, పదునారేండ్ల కన్య సిల్కు జంపెరలో కుదుల్తూ, తన్ను మోహిస్తూ నిలుచున్నట్లు చెప్పగలడు.

"మేలి ముసుగులోన,
మెదలకను నిలచి,
తలుపు చెక్క నీవు,
తలరు చున్నావే!"

అని మావాడు తలుపును తలవని తలం పుగా తరుణియని తలచి తలుపులకులోనై భావ మును దీసి గీతముగా అల్లగలడు'' అని మోహ నుడు. "అనగా అతనికి తలుపునుండి ఆ భావ ము స్ఫురించిన దన్నమాట" అని శ్రీనాథుడు అన్నాడు. "మీరు ఆలాగు చెప్పగలరా'' అని మోహనుడు ప్రశ్నించాడు. "నా పద్ధతి అది గాదు. చూడండి. ఆ పిల్ల మన ఎదుట నుండి ఆలాగు పోవుచున్నది కదా, పోవు నప్పుడు......

సీ॥ పైట యల్లల్ల నాడ । పావాడ జీరాడ,
నడుమూగి తెగయాడి । నాట్యమాడ,
చెవులు దుద్దులు యాడ । చిరు ......
యీలాగు పోతుంది మా కవిత్వం"

అని శ్రీనాథుడు చెప్పాడు.

"అంటే స్వభావముగా ఆ పిల్ల ఎట్లాగు పోవుచున్నదో అట్లాగు చెప్పడము మీకవిత్వ లక్షణ మన్నమాట" అని మోహనుడన్నాడు "అక్కడ నూతన భావ మేమీలేదు. ఎట్లా గున్నది అట్లాగు వర్ణించడమే. వాళ్లు స్త్రీని వర్ణించారంటే ఆ వర్ణించిన స్త్రీ ఒరిజినల్ కాపీ **(Original Copy)** ఎక్కడో వున్న దన్న మాట" అని నేను అన్నాను. "అవును భావ కవిత్వములో అట్లాగు కాదు, శ్రీనాథ కవి గారు! గాలిలో దీపమును పెట్టినట్లు, ఆకాశము నకు భూమికి మధ్య, సంధ్యారాగములో తొల కరి మబ్బులో మెఱపు తీగెవంటి మెలత వున్న దని భావించి భావగీతమును పాడగలరు మా భావకవులు'' అని మోహనుడన్నాడు. "అదే భ్రమ. భ్రమసి పాడినది భావగీత అవుతుంది" అని శ్రీనాథుడన్నాడు.

నాకు కొంచము కోప మొచ్చింది, "అయితే శ్రీనాథుడుగారు. మీరు శృంగార నైషధ ములో దమయంతిని ఆపాదమస్తకము వర్ణిస్తూ, ఆమె తొడలు, నాభీ, యింకా యింకా ఏవేవో వర్ణించి వదిలారే అవన్నీ మీరు చూచి వర్ణిం చినవేనా'' అని అడిగాను. శ్రీనాథుడు నేను చెప్పినదేదో విననట్టు తోస్తుంది. అతని దృ ష్టంతా, స్త్రీలకు అడ్డుకై కట్టిన పలకల ప్ర క్కనుజేరి తొడలు బరుకుకొనుచున్న సెట్టిపై వుంది. "చూశారా! ఆ సెట్టిని" అని అన్నా డతడు. "ఓ చూచాము. తొడలు బఱ్ఱు బఱ్ఱుని పిల్లి తలుపును బరికినట్లు బరుకు కుంటున్నాడు" అని మోహనుడన్నాడు. "అప్పుడు మనమేమి అనుకొనవలెను. సెట్టిగారికి తొడలనిండా ఎండు గజ్జి పట్టుకుందని భావించవలెను. అంతేగాని సెట్టిగారి వద్దకుబోయి, 'సెట్టిగారు! మీకు ఎండుగజ్జి వుందా! తొడను చూపండి. తడవ నివ్వండి. వాసన చూడనివ్వండి' అని అడిగి ఆయా పనులుచేసి పద్యము వ్రాస్తామా. మనకు కావలసిన దేమిటంటే, మనము వూ హించినట్లు సెట్టిగారికి ఎండు గజ్జి వున్నదా లేదా. అదే మనము ఆలోచించాలె" అని శ్రీనాథుడన్నాడు. "ఇది ఊహ అన్నమాట" అని నేను అన్నాను. "ఊహే భావము. భా వమే వూహ" అని అతడన్నాడు. "ఊహ లే నిది ప్రపంచమే లేదు. కాదుగాని, శ్రీనాథుడు గారు! మీకాలములో పద్యాలు వ్రాసేటప్పుడు తెలియని సమాసాలు వేసి పద్యమును బిరుసె

క్కన రొట్టెక్రింద చేసారెందుకు" అని మోహనుడు అన్నాడు. "పూర్వకాలములో కవిత్వము అనే కన్య యౌవ్వనములో ఉండి జిగిగా వుండేది. ఇప్పుడేముంది మన ప్రక్కను కూర్చున్న కండ్లద్దాల కాలేజీ పిల్లవలె నాజూకెక్కువై, నాజూకెక్కువయిన కొలది నీరసించి, అలంకారమునకు గాజు బొమ్మ వాటంలో దిగింది. ఈ కాలములో కవిత్వము,—

జిగిపోయి బిగిపోయి—జీవము వాడి అగుపించు కాలేజి—అంగనై మారె దానికేమి:
ఈ కాలములో కవులు ఎలాగు బ్రతుకుతున్నారు" అని శ్రీనాధుడు ప్రశ్నించాడు.

"గొంగలి పురుగులు మునగ కొమ్మలను పట్టుకుని బ్రతికినట్లు యీ కాలపు కవులు బజారు పత్రికలను పట్టుకుని బ్రతుకుతున్నారు" అని మోహనుడు జవాబిచ్చాడు.

"ఈ పత్రికలు లేకపోతే వారూ వుండేవారుకారు" అని నేను అన్నాను.

"ప్రభువులంతా ఏమయినారు?" అని శ్రీనాధుడు ప్రశ్నించాడు.

"పనిలేక పట్నంలో తిరుగుతున్నా"రని మోహనుడు జవాబు చెప్పారు.

"వాళ్ల ఆదరణ లేదా!" అని శ్రీనాధుడన్నాడు.

"వాళ్లే నిరాధారంగా వున్నారు, ఆదాయమునకు మూడురెట్లు ఖర్చు చేసుకుంటూ" అని మోహనుడు అన్నాడు.

"అయినా యీ కాలమునకు కవి అవసరమేమిటి. వాని కవిత్వ మవసరమేమిటి. శుభ్రమైన తేలిక వచనము చాలదూ!" అని నేను అన్నాను.

"అవును. 'కంటు సింప్లిసిటీ (come to simplicity) లీవింగిది సిటీ' అని అన్నారు పెద్దలు" అని మోహనుడన్నాడు.

"అసగా అర్థమేమి" అని శ్రీనాధుడడిగెను.

"నిరాడంబముగా బ్రతుకమని అర్థము" అని మోహనుడు తెనిగించాడు.

అయితే ఎందుకోయి నీకా తెల్లని పంట్లాము? ఆ నగిషీ జోడెందుకు, నడుముకు పాముతోలు పటకా ఎందుకు, బొడ్డుచారల సిల్కు చొక్కా ఎందుకు. లోపల అంత దళసరి బనీ నెందుకు. ఉక్కపోసి చస్తూవున్న ఆ బొంత కోటెందుకు? కండ్లకు ఆపీర్ల పులి జోడెందుకు. మొగము మీద పడేలాగ పెంచుకున్న క్రాపింగు జుట్టెందుకు గాంధీ మహాత్మునిలాగ గావంచ కట్టుకుని ఆకు చెప్పులతో తిరుగరాదు. నిన్నెవరు కొట్టచ్చారు" అని శ్రీనాధుడు మోహనునితో అన్నాడు.

"అయితే నగ్నముగా వుండమనా మీ వుద్దేశం" అని మోహనుడు అడిగాడు.

"అదీ కొంత నయమే" అని శ్రీనాధుడు ఏదో ఆలోచిస్తూ అన్నాడు.

"ఇంకేది ప్రియము" అని మోహనుడన్నాడు.

"ఏమోయి! ఈ కాలములో జాకెట్టు గుడ్డ ప్రియమూ, మా స్త్రీలంతా సగము జాకెట్లు తొడుక్కున్నారు" అని శ్రీనాధుడన్నాడు.

"చంపారు. అదొక అందము" అని మోహనుడు చెప్పాడు.

"ఇదే మందము. సగము రొమ్ము కనిపిస్తూవుంటే. మిగత సగమునకు, వినాయకుని బొడ్డుపై చుట్టూ గుడ్డను చుట్టినట్టు, ఆ సన్నని సిల్కు గుడ్డెందుకు అడ్డు" అని శ్రీనాధుడన్నాడు.

"కవిత్వము యీ కాలమున కెందుకూ అని అడుగుతూ వుంటే యీ గోలలో దిగా రెందుకు?" అని నేను అన్నాను.

"భాష అనేది ఒక కన్య. ఆమెను అలంకరించునవి వచనము, కవిత్వము. వచనముండి కవిత్వము లేకపోతే, చీరె వుండి జాకెట్ చాలని ఆ అమ్మాయిలాగ వెలితి పడిపోతుంది. కవిత్వముండి వచనము లేకపోతే యిక వేరే చెప్ప నవసరములేదు. జాకెట్ వుండి అసలుది (చీర) కొరత వచ్చినట్లుయి పోతుంది" అని శ్రీనాధుడన్నాడు.

"రెండూ లేకపోతే" అని పెంకితనముగా మోహనుడన్నాడు.

"ఆ రెండూ లేకపోతే స్త్రీయే కాదు. మన లాటి మగపురుగే" అని శ్రీనాధుడన్నాడు.

"కాదు గాని. శ్రీనాధుడుగారు! భావ కవిత్వం మంచిదంటారా. చంధోకవిత్వం మంచిదంటారా" అని మోహనుడన్నాడు.

"స్త్రీకి జాకెట్ అవసరమంటారా, రవిక అవసరమంటారా అంటే నేనేమి చెప్పేది. ఏదన్నా అవసరమే. కాని చాలీ చాలకుంటే ఏదన్నా వెలితి చూపెడుతుంది. ఆ వెలితి లేకుండా చూసుకోండి. కవిత్వంలో వున్న వెలితి దోషమే, యీ కాలపు స్త్రీలకు చాలీ చాలని జాకెట్ వేషములో దిగింది" అని శ్రీనాధుడు చెప్పాడు. ఇంతలో లైట్లు ఆరిపోయినవి. సినిమా ఆరంభించారు. వీలుంటే తక్కిన సంగతులు యింకొకసారి విన్నవిస్తాను.


**మూలవ్యాధి**

బవాసిర్ సంఘర్ చిరకాలమునుండియున్న వ్యాధిగాని, క్రొత్తదిగాని, ఎట్టి స్థితిలోయున్నను నొప్పి, జల, మొలలు, మంట బాదలను మొదటి పూటలోనె నివారణజేయును. ఆపరేషన్ లేక 3 రోజులలో సంపూర్ణగుణము. గుణమివ్వనిచో సొమ్ము వాపసు ఇవ్వబడును. వెల రూ. 2.

**చెవుడు**

మా "బహిరోదీపన" తైలము చెవి బాధలకు అమోఘమైనది. చెవుడు చెవిలో నీరు, చీముకారుట, పోటు, దురద, పుండ్లు మొదలగు వాటిని శీఘ్రముగ పోగొట్టును. వేలకొలది చెవిటివారు ఈ ఔషధముచే గుణమొందిరి. గుణమివ్వని యెడల సొమ్ము తిరిగి ఇవ్వబడును. వెల రూ. 2.

శక్తి సుధా కార్యాలయ, కుంబార్ వాడ 4-వీధి, బొంబాయి, నెం. 4.